సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



చేపల వ్యర్థాల నుంచి ఎరువు

చేపల వ్యర్థాల నుంచి ఎరువు తయారీ వైపు విశాఖ ఫిషింగ్ హార్బర్ అడుగులు వేస్తోంది. IIలో



బాధ్యతగా అర్జీలు పరిష్కరించండి

ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. IIలో



గాంధీ ఆశయాలు ఆదర్శనీయం

మహాత్మాగాంధీ ఆదర్శాలు భారతీయులు గుర్తించుకోవాలని గాంధీ సెంటర్ అధ్యక్షులు బాలమోహన్‌దాస్ అన్నారు. IIలో

జెండా పండగకు సర్వం సిద్ధం



గౌరవ వందన సమర్పణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ



- పోలీస్ బ్యారెక్స్‌లో ఏర్పాట్లు
- పతాకావిష్కరణ చేయనున్న ఇన్‌చార్జి మంత్రి విడదల రజని

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్స్



అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో వెయ్యి అడుగుల జాతీయ పతాకం ప్రదర్శన

అల్లిపురం/మహారాణిపేట: పంద్రాగస్టు పండగకు పోలీస్ బ్యారెక్స్ మైదానం సిద్ధమైంది. మంగళవారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు వేదిక, కవాతు, శకటాల ప్రదర్శనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన 450 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. ఆయా శాఖలకు చెందిన 11 శకటాలను, స్టాళ్లను సిద్ధం చేశారు. పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విమానాశ్రయం, రైల్వే స్టేషన్, పాఠశాలలు, కళాశాలలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

దొండపర్తి: ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ సోమవారం పరిశీలించారు. వేదిక, వీవీఐపీ భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర సమరయోధులు, విద్యార్థులు, ప్రజలకు సదుపాయాలు, బందోబస్తు, భద్రతపై సూచనలు చేశారు.



మిరుమిట్లు గొల్పుతున్న కలెక్టరేట్



విద్యుత్ కాంతులతో విమానాశ్రయం



రైల్వేస్టేషన్‌కు త్రివర్ణ శోభ

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఏపీఎల్-2

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ బుధవారం నుంచి డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. రోజుకు రెండు మ్యాచ్‌లుగా మొత్తంగా 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. నాకవుట్ అనంతరం 27వ తేదీన టైటిల్ పోరుతో సీజన్ ముగియనుంది. సాయంత్రం 4 గంటలకు జరగనున్న ప్రారంభ మ్యాచ్‌కు హీరోయిన్ శ్రీలేఖ హాజరై అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపనున్నారు. మన ఆంధ్ర మన ఏపీఎల్ పేరిట ఆంధ్రా క్రికెటర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏపీఎల్ నిర్వహిస్తుండగా ఆరుజట్లు పోటీకి సిద్ధమవుతున్నాయి. పోటీలు వీక్షించేందుకు వచ్చే వారికి ఉచితంగా అందించే టికెట్లతో లక్కీడిప్ తీయనున్నారు. అభిమానులు టికెట్లపై తమపేరు, ఫోన్ నెంబర్ రాసి స్టేడియంలో ఏర్పాటు చేసిన లక్కీడిప్ బాక్స్‌లో వేయాలని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్నివాల్‌లో ఫుడ్‌ఫెస్టివల్, గేమ్స్ నిర్వహించనున్నామన్నారు. ఈనెల 16, 19, 20, 26, 27వ తేదీల్లో మ్యాచ్ వీక్షించిన వారిలో.. లక్కీడిప్‌లో ఐదుగురేసి అభిమానుల్ని ఎంపిక చేసి నవంబర్‌లో జరిగే ఆస్ట్రేలియా ఇండియా మ్యాచ్ వీక్షించేందుకు ఉచితంగా పాసులు ఇస్తామన్నారు.

డీసీపీ ఆనందరెడ్డికి మెరిటోరియస్ అవార్డు

ఏఆర్ ఎస్‌ఐ బెండి కాశీపతికి కూడా..



డీసీపీ-2 కె.ఆనందరెడ్డి

దొండపర్తి: విశాఖ డీసీపీ-2 కె.ఆనందరెడ్డికి ప్రతిష్టాత్మక మెరిటోరియస్ అవార్డు వరించింది. విధి నిర్వహణ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు అందించే ఈ అవార్డు ఎస్‌ఐ స్థాయి నుంచి ఎస్పీ స్థాయికి ఎదిగిన ఆనందరెడ్డికి దక్కింది. ఈయనతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న బెండి కాశీపతికి కూడా మెరిటోరియస్ అవార్డు లభించింది.

జూనియర్ సివిల్ జడ్జిగా ఏయూ విద్యార్థి వంశీకృష్ణ



వంశీకృష్ణను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలకు చెందిన మజ్జి వంశీకృష్ణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో వంశీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. తొలి ప్రయత్నంలోనే, ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే న్యాయమూర్తిగా ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయానికి మరింత పేరుతెచ్చే విధంగా విధులు నిర్వహించాలని కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న సమయంలో పలువురు న్యాయాధికారుల ప్రసంగాలు, వర్సిటీ అందించిన అవగాహన తరగతులు తనకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని వంశీకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఏయూ న్యాయ కళాశాల ఆచార్యులు కె.సీతామాణిక్యం, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రావణ శుక్రవారాల్లో లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఈ నెల 18,25 తేదీలతో పాటు వచ్చేనెల 1, 8, 15 తేదీల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సింహవల్లీ తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2500 టికెట్ తీసుకోవాలన్నారు. అలాగే శ్రావణ శుక్రవారం రోజుల్లో సాయంత్రం 5.30 గంటలకు సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనామార్చన పూజ ఉంటుందని, ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు 500 టికెట్ తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా టికెట్ తీసుకునే సదుపాయం ఉందన్నారు.

నేడు నగరానికి చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విశాఖలో మంగళవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎంజీఎం గ్రౌండ్స్‌కు నడక మార్గంలో ర్యాలీగా వెళతారు. ఎంజీఎం గ్రౌండ్స్‌లో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌ఎస్‌టీ) సభలో పాల్గొని గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదిగేందుకు ఉన్న 5 వ్యూహాత్మక అంశాలపై రూపొందించిన 'ఇండియా విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తారు.

లక్ష్మీపురం సర్పంచ్‌గా జగదీశ్వరరావు ఏకగ్రీవం

8 మంది వార్డు సభ్యులు కూడా..



ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీశ్వరరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం సర్పంచ్‌గా లచ్చుభుక్త జగదీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేష్ పట్నాయక్ సోమవారం సాయంత్రం ప్రకటించారు. జగదీశ్వరరావు తండ్రి లచ్చుభుక్త రామారావు ఇటీవల మృతి చెందడంతో ఖాళీ ఏర్పడిన స్థానానికి ఈ నెల 8న నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిగా జగదీశ్వరరావు నామినేషన్ దాఖలు చేయగా టీడీపీ మద్దతుతో బోని రమణ, జనసేన మద్దతుతో కరుభుక్త చందు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కరుభుక్త అప్పలరాజు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచనలతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ రంగంలోకి దిగి మిగిలిన అభ్యర్థులు పోటీ నుంచి ఉపసంహరించుకునేలా పావులు కదిపారు. వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గాడు తాతినాయుడు, కరుభుక్త జోగినాయుడు, కరుభుక్త అప్పలనారాయణ, గుడ్డాల ఎల్లయ్య, కనకల వెంకటరమణ తదితరులు మిగిలిన పోటీదారులతో మాట్లాడి పోటీ నుంచి ఉపసంహరించుకుని చనిపోయిన ప్రజాప్రతినిధిని గౌరవించాలని కోరారు. దీంతో జగదీశ్వరరావు ఎన్నిక ఏకగ్రీవం అయింది.

- టి.నగరపాలెం పంచాయతీ 10వ వార్డుకు పూసర్ల రామారావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవానికి మార్గం సుగమం అయింది.
- ఆనందపురం మండలంలో నాలుగు వార్డు స్థానాలు, పద్మనాభం మండలంలో మూడు వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

'రుషికొండ'పై తప్పుదోవ పట్టిస్తున్నారు..

- గీతం భూ ఆక్రమణలపై నోరుమెదపరేం
- చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ యాత్ర
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ధ్వజం
- విశాఖలో జనసేన ఒక్కసీటు కూడా గెలవలేదు: మాజీ ఎమ్మెల్యే రెహమాన్



మాట్లాడుతున్న కోలా గురువులు, ఎస్ఏ రెహమాన్

మహారాణిపేట : రుషికొండపై ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే.. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ కల్యాణ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రుషికొండ పక్కనే గీతం వర్సిటీలో భూకబ్జా జరిగినా పవన్‌కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. విశాఖ ప్రజలు నాలుగు రోజులుగా పవన్ వెకిలి చేష్టలు చూసి విసిగిపోయారన్నారు. జనసేన జెండాను పూర్తిగా పక్కన పెట్టేసి చంద్రబాబు అజెండా కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. పూర్తి సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై నోరు పారేసుకోవడం తగదన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ఇప్పటికీ ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ప్రతీ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసూయ, ద్వేశం, కోపంతో పవన్ మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నుంచి ప్యాకేజీ తీసుకుని సీఎం జగన్‌పై బురద జల్లుతున్నారన్నారు. సోమవారం దత్తపుత్రుడు వెళ్లిపోతే... మంగళవారం దత్త తండ్రి విశాఖకు వస్తున్నాడన్నారు. మత్స్యకారులు వలసలు పోతున్నారని చంద్రబాబు, పవన్ దుష్ప్రచారం చేస్తున్నారని.. మత్స్యకారులు వలస బాట పట్టిందే టీడీపీ ప్రభుత్వంలో అని గుర్తు చేశారు. మత్స్యకారులంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమితమైన ప్రేమని, వారి అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్ మాట్లాడుతూ రుషికొండపై టూరిజం రిసార్టు నిర్మాణానికి చెట్లను తొలగించింది చంద్రబాబు ప్రభుత్వంలో కాదా..?, రామానాయుడు స్టూడియో కోసం చంద్రబాబు హయాంలోనే కొండలు, చెట్లు కొట్టించారన్న విషయం తెలియదా..? అప్పుడు నీవు గాడిదలు కాస్తున్నావా...? అని పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. విశాఖలో ప్రభుత్వ భూముల దోపిడీ జరిగింది టీడీపీ ప్రభుత్వంలోనే అని స్వయానా అయ్యన్నపాత్రుడు చెప్పింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. లింగమనేని నిర్మాణం చేపట్టినప్పుడు పర్యావరణం విషయం పవన్‌కు గుర్తుకు రాలేదా..? విశాఖకు వచ్చినప్పుడే పర్యావరణం గుర్తుకొస్తుందా..? అని విమర్శించారు. చంద్రబాబుకు మతిమరుపు వ్యాధి, పవన్‌కు అల్జీమర్స్ సోకిందన్నారు. విశాఖ నగరంలో ఒక సీటు అయినా పవన్ గెలిస్తే తాను గుండు గీయించుకుని తిరుగుతానని, లేకుంటే ఏమి చేస్తారని సవాల్ విసిరారు.

రైల్వే పరిధిలో నేరాల నియంత్రణకు ఉమ్మడి ప్రణాళిక

దొండపర్తి: రైల్వే పరిధిలో నేరాల నియంత్రణకు సివిల్, జీఆర్పీ పోలీసుల ఉమ్మడి ప్రణాళిక రూపొందించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం. త్రివిక్రమ్ వర్మ ఆదేశించారు. సోమవారం సీపీ ఛాంబర్‌లో జీఆర్పీ పోలీసులు, నగర పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర రైల్వే పరిధిలో ఇటీవల జరుగుతున్న చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన ఉమ్మడి నిర్ణయాలపై చర్చించారు. జీఆర్పీ డీఎస్పీ మోహనరావు, ఇతర అధికారులు ఈ సమన్వయ సమావేశంలో పాల్గొని రైల్వే పరిధిలో నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. నేరస్తులను అరెస్టు చేయడంలో స్థానిక పోలీసుల సహాయ సహకారాలు తీసుకోవాలని నిర్ణయించారు. నేరాలు అదుపులో ఉండేందుకు ప్రణాళిక రూపొందించి తక్షణమే ఇరు శాఖలు అమలు చేసే విధంగా సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

ప్రైవేటుకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



గ్రాండ్ సెంటినరీ ఆర్చ్ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని. చిత్రంలో ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే వాసుపల్లి, కలెక్టర్ మల్లికార్జున



రెండో అత్యవసర విభాగంలో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

మహారాణిపేట: కేజీహెచ్‌లో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రూ.30 లక్షల వ్యయంతో 15 అదనపు పడకలతో అత్యవసర చికిత్స విభాగం అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ఏర్పాటుచేసిన ప్రధాన ద్వారం, రెండో క్యాజువాలిటీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించేలా ఆరోగ్య శాఖ 24 గంటలూ పని చేస్తోందన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో రూ.36 లక్షల ఖర్చుతో గ్రాండ్ సెంటినరీ ఆర్చ్ ప్రారంభించామన్నారు. మొత్తంగా రూ.66 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర మెడికల్ కాలేజీలో రూ. 600 కోట్లతో 'నాడు - నేడు'లో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ.73 కోట్లతో పీజీ హాస్టల్స్ నిర్మాణం, రూ.79 కోట్లతో వైద్య పరికరాలు సమకూర్చడం, రూ.12 కోట్లతో ఎంఆర్ఐ స్కాన్‌కు సంబంధించి పరికరాలకు ఆర్డర్ ఇచ్చామన్నారు. రూ.4 కోట్లతో సిటీస్కాన్‌ను కొనుగోలు చేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం నర్సింగ్ కాలేజీ విద్యార్థినులకు రూ.29 లక్షల వ్యయంతో గ్లాస్ ఫార్మా సంస్థ సమకూర్చిన 51 సీటర్ బస్సును మంత్రి ప్రారంభించారు.

రూ.10 కోట్ల సీఎస్సార్ నిధులతో అభివృద్ధి

కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కేజీహెచ్‌లో గత సంవత్సర కాలంలో రూ.10 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పది అంబులెన్స్‌లు నెల రోజుల్లో రానున్నాయని తెలిపారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.2.5 కోట్ల విలువ చేసే అత్యవసర పరికరాలు సమకూరుస్తున్నామన్నారు. క్యాజువాలిటీ విస్తరించి కౌంటర్లు, వెయిటింగ్ హాల్స్, లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. భావనగర్, రాజేంద్రప్రసాద్ వార్డులను ఆధునికీకరించామన్నారు. 200 పడకలతో మెడ్రాస్ చౌల్ట్రీ, రూ.80 లక్షలతో మెడ్రాస్ మార్చురీ నిర్మించామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో కేజీహెచ్ ఉండేదన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, రిటైర్డు డీఎంఈ డాక్టర్ రవిరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వైద్యులు రాధాకృష్ణ, రాజేంద్రప్రసాద్, నవీన్, కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దళమంతుల మాణిక్యాలరావు, దళమంతుల చిన్ని, ఎస్. రాము, రామలక్ష్మి, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

అన్నదాతకు వందనం


చిరు ధాన్యాలతో సందేశాత్మక చిత్రం



మిల్లెట్స్‌తో విజయకుమార్ తీర్చిదిద్దిన చిత్రం

ఏయూ క్యాంపస్: దేశ ప్రజల ఆకలి తీర్చే అన్నదాతల రుణం ఏమిచ్చి తీర్చుకోగలం. సైనికులు, రైతులు దేశానికి రెండు కళ్లవంటివారు. సైనికులు దేశ సరిహద్దులో రక్షణగా నిలబడి ప్రజల ప్రాణాలను నిరంతరం పరిరక్షిస్తుంటారు. రైతన్నలు ఎండనక, వాననక ఆహారాన్ని పండించే క్రతువును నిర్వర్తిస్తుంటారు. వీరిద్దరినీ గౌరవిస్తూ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మిల్లెట్స్ (చిరు ధాన్యాలు), కొద్దిపాటి రంగులు ఉపయోగించి సందేశాత్మక చిత్రం తీర్చిదిద్దారు. ఇందులో నాగలి పట్టిన రైతన్న చిత్రాన్ని మిల్లెట్స్‌తో తయారు చేశారు. కిందన మన దేశంలో పండే చిరుధాన్యాల పంటలను నేలపై పరిచి, పంటగా చూపారు. 80 శాతం మిల్లెట్స్, 20 శాతం వర్ణాలను అద్ది దీనిని తీర్చిదిద్దారు. ప్రధాని నినాదం మై సోయిల్ - మై కంట్రీ, శెల్యూట్ టు ది సోయిల్ - శెల్యూట్ టు ది బ్రేవ్' అనే సందేశాన్ని ఇందులో పొందుపరిచారు. 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రోత్సహించాలని, చిరుధాన్యాలకు ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరించనున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

సాక్షి, విశాఖపట్నం : మారథాన్‌లతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న నిర్వహించే వైజాగ్ మారథాన్ (రెండో ఎడిషన్) పోస్టర్‌ను నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారథాన్‌లో వాటర్ బాటిళ్లు వాడకుండా ఎక్కడికక్కడ స్టాల్స్ ఏర్పాటు చేసి స్టీల్ గ్లాసులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇటువంటి మారథాన్‌ల వల్ల విశాఖ పేరు ప్రఖ్యాతలు పెరుగుతాయన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణారాయ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతోపాటు, మత్తు పదార్థాలు, పర్యావరణం, ప్లాస్టిక్ వ్యర్థాలపై మారథాన్‌లో అవగాహన కల్పించనున్నామన్నారు. 21 కె, 10 కె, 5 కె, 3 కె విభాగంలో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.5 లక్షల బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. ఔత్సాహికులు http://www. vizagmarthon.run వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో సంధ్యా మెరైన్స్ డైరెక్టర్ కె.ఆనంద్, రామచంద్ర, రవి నంబూరి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సామాన్య ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. పిటిషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ డా.మల్లికార్జున వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 241 విజ్ఞప్తులు అందగా.. ఇందులో రెవెన్యూకు సంబంధించి అత్యధికంగా 95 అర్జీలుండగా, జీవీఎంసీ 52, పోలీస్ శాఖకు సంబంధించి 15, ఇతర విభాగాలకు సంబంధించి 79 ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, ఇతర విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఇతర అధికారులు

పోలీస్ స్పందనకు 40 ఫిర్యాదులు

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 40 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణపై మేయర్ ఆగ్రహం

డాబాగార్డెన్స్: వీధి దీపాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంపై నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాల్, శ్యాంసన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు లక్ష్మోజీతో వీధి దీపాల నిర్వహణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ఏ వార్డు సందర్శించినా వీధి దీపాల నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని ఆదేశించారు.

తక్షణమే వినతులు పరిష్కరించాలి

'జగనన్నకు చెబుదాం'కు 80 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 80 ఫిర్యాదులు వచ్చాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వినతులు స్వీకరించారు. మొత్తం 80 వినతులు అందాయి. రెండో జోన్‌కు పది, మూడో జోన్‌కు 19, నాల్గో జోన్‌కి 10, ఐదో జోన్‌కి 8, ఆరో జోన్‌కి 13, ఎనిమిదో జోన్‌కి ఏడు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు వచ్చాయి. వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజినీర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, మేయర్ హరి వెంకటకుమారి

ముగ్గురు యువకులు.. 76 కిలోమీటర్ల పరుగు

సాక్షి, విశాఖపట్నం: స్వాతంత్ర్య దినోత్సావాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన ముగ్గురు యువకులు 76 కిలోమీటర్ల మేర పరుగు ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ సభ్యులైన హరి, సునీల్, వంశీకిరణ్ బీచ్‌రోడ్డులో సోమవారం ప్రారంభించిన పరుగు నగరం మొత్తం తిరిగి మరలా బీచ్‌రోడ్డులో ముగియనుంది. ఈ పరుగు కలెక్టర్ ఆఫీసు, రైల్వేస్టేషన్, సింధియా, గాజువాక, ఎన్‌ఏడీ, గోపాలపట్నం, వేపగుంట, సింహాచలం, అడవివరం, సెంట్రల్ జైల్, పెదగదిలి, తెన్నేటిపార్క్, ఎంవీపీ కాలనీ, వుడా పార్క్ మీదుగా సాగనుంది. 10 గంటలపాటు ఈ పరుగు కొనసాగనుందని, మంగళవారం ఉదయానికి బీచ్‌రోడ్డుకు చేరుకుంటామని యువకులు తెలిపారు.


బీచ్‌రోడ్డులో పరుగు కోసం సిద్ధమైన యువకులు హరి, సునీల్, వంశీకిరణ్

చేపల వ్యర్థాల నుంచి ఎరువు

- ఫిషింగ్ హార్బర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు
- ఈ చేపలరేవులో రోజుకు టన్ను వ్యర్థాలు
- ఇన్నాళ్లూ వీటిని సముద్రంలోకి డంపింగ్
- దీంతో కలుషితమవుతున్న సాగరం
- ఇకపై డంపింగ్‌కు అడ్డుకట్టతోపాటు ఉపాధి అవకాశాలు


ఫిషింగ్ హార్బర్‌లో చేపలను కోస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం: చేపల వ్యర్థాల నుంచి ఎరువు తయారీ వైపు విశాఖ ఫిషింగ్ హార్బర్ అడుగులు వేస్తోంది. ఇన్నాళ్లూ ఈ హార్బర్ చేపలు, రొయ్యల వ్యర్థాలతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో సముద్రమూ కలుషితమవుతోంది. పర్యావరణానికీ విఘాతం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోనే అతి పెద్దదైన ఈ చేపలరేవు నుంచి 680 మరబోట్లు, 540 మోటారు, నాన్ మోటారు బోట్లు చేపలవేట సాగిస్తుంటాయి. వీటి ద్వారా రోజుకు సగటున 148 టన్నుల చేపలు హార్బర్‌కు వస్తుంటాయి. వీటిలో 20 శాతం స్థానికంగా అమ్ముడవుతాయి. మిగిలినవి వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. చేపలను ఇతర ప్రాంతాలకు ఎగుమతికి వీలుగా చేపల్లోని వ్యర్థాల (తలలు, ప్రేగులు, గాల్‌బ్లాడర్, రెక్కలు, తోకలు వంటివి)ను తొలగిస్తారు. చేపలతో పాటు రొయ్యల తలలను వేరు చేసి ప్రాసెసింగ్ అనంతరం వీటిని ఆయా ప్రాంతాలకు పంపిస్తారు. ఇక్కడ సుమారు 200 మంది విక్రయదార్లు చేపల వ్యర్థాలను వేరు చేయడానికి 50కి పైగా కట్టర్లను వినియోగిస్తారు. ఇలా చేపలు, రొయ్యల నుంచి వేరు చేసిన వ్యర్థాలను హార్బర్ నుంచి సముద్రంలోకి విసిరేస్తారు. ఈ వ్యర్థాలు రోజుకు సగటున టన్ను వరకు ఉంటాయని అంచనా. ఇలా టన్నుల కొద్దీ డంపింగ్ చేయడంతో కుళ్లిపోయి హార్బర్ పరిసరాలన్నీ దుర్గంధ భరితమవుతున్నాయి. సముద్ర జలాలూ కలుషితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ హార్బర్‌లో పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా మత్స్యశాఖ, జీవీఎంసీ, ఫిష్‌నెట్ వంటి సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. జీవీఎంసీ ఈ వ్యర్థాల కోసం చెత్తబుట్టలను సమకూర్చింది. ఇవి కుళ్లి దుర్వాసన వెదజల్లడంతో ఆ బాస్కెట్ల వినియోగానికి మత్స్యకారులు తిలోదకాలిచ్చారు. సముద్రంలోకి వ్యర్థాలను వదలడం మళ్లీ మొదలెట్టారు.

వ్యర్థాల్లో పోషకాలతో ఎరువు.

చేపల వ్యర్థాల్లో ఎరువుకు అవసరమైన ఎన్నో పోషకాలుంటాయి. వీటిలో అధిక ప్రొటీన్లు, ఫాస్పరస్, పొటాషియం వంటివి ఉంటాయని, వీటి ద్వారా వ్యవసాయానికి అవసరమైన ఎరువును తయారు చేయవచ్చని శాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు. ఇది పర్యావరణ హితమైనదే కాకుండా నిరుద్యోగ యువతకు, మత్స్యకారులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే వనరు కూడా అవుతుందని నిర్ధారించారు. ఇప్పటికే చెన్నైలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ (సిబా) సాయంతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐకార్) మత్స్య వ్యర్థాలతో ప్లాంక్టన్ ప్లస్, హార్టి ప్లస్ అనే రెండు విలువ ఆధారిత ఉత్పత్తులపై తయారీపై శిక్షణ ఇస్తోంది. వీటిలో ప్లాంక్టన్ ప్లస్ ఆక్వాకల్చర్‌లోనూ, హార్టి ప్లస్ ఉద్యాన పంటలకు ఎరువుగా ఉపయోగపడుతుంది. ఇందుకు యూనిట్ వ్యయం రూ.62 వేల వరకు ఉంటుంది. స్థాపనకు 75 చదరపు అడుగుల స్థలం సరిపోతుంది. వెయ్యి కిలోల చేపల వ్యర్థాలను రెండు గంటల్లోనే గ్రైండ్ చేస్తుంది. ఇది ఎరువుగా మారడానికి రెండు నెలల సమయం పడుతుంది. వెయ్యి కిలోల వ్యర్థాల నుంచి 500 కిలోల వరకు ఎరువు తయారవుతుంది. ఇలాంటి యూనిట్లు సముద్ర జలాల కలుషితమవుతున్న తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఏర్పాటయ్యాయి.

హార్బర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు



ఇప్పుడు చేపల వ్యర్థాన్ని సంపదగా మార్చే యూనిట్‌ను విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ యూనిట్ స్థాపనకు ఎవరైనా ముందుకొస్తే విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో స్థలాన్ని కేటాయిస్తాం. ఇది అందుబాటులోకి వస్తే విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. సముద్ర జలాల కలుషితాన్ని నివారించే వీలుంటుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా లభిస్తుంది.

–జి.విజయ, జిల్లా మత్స్యశాఖ అధికారి, విశాఖ

ముత్యాలమ్మపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్


సోమినాయుడు, కార్యదర్శి

పరవాడ: పలు ఆరోపణల నేపథ్యంలో మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.సోమినాయుడును సస్పెండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటి పన్నులు వేయిస్తానని చెప్పి గ్రామంలో పలువురి నుంచి డబ్బులు వసూలు చే శారని గ్రామానికి చెందిన బొంది దుర్గాలు అనే వ్యక్తి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి విచారణ జరిపారు. సదరు విచారణలో పంచాయతీ కార్యదర్శి సోమినాయుడు లంచం కాదని.. పలువురు డబ్బులు ఇస్తే తీసుకున్నానని చెప్పడంతో సోమినాయుడుపై చర్యలు కోసం జేసీ జాహ్నవి నివేదిక కలెక్టర్‌కు సమర్పించారు. జేసీ నివేదిక ఆధారంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పంచాయతీ కార్యదర్శి సోమినాయుడును సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యేవరకు సస్పెన్షన్ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874 [R-63]

ONLINE DEGREE

■ Online Degreee / MBA Admissions Open in Govt. Univ. Failed or Discontinued Students Can Complete their Degree. Eligible for all Govt. Jobs. Ph : 79972 96796 [V- 11670]

ONE SITTING

■ One Sitting : 10th, Inter, Degree (All), PG (All), BBA, BCA, MBA, MCA, Dip. Engg., B.Tech, M.Tech, Dip. VET, Nursing, Pharmacy, B.Ed, Ph.D from Govt. Recog. Univs. Ph : 83417 74299 [V- 794478]

Real Estate

FLAT FOR SALE

■ 1290 Sft Builtup Area & 100 ft Parkings 4th Floor, Unit No-501 in Viswanadh Avenue S-V-18, Madhurawada Village GVMC Area Construction Complete Interest Buyers Cont : 88008 80757 [V- 794694]

■ 3BHK Flat Gated Society North Facing 9 years Old at Purushottapuram. Ph : 9866327757 [HA-4430]

PLOT FOR SALE

■ హైవే ఫేసింగ్ VUDA ప్లాట్లు @ విజయనగరం 5th బెటాలియన్ / కోనాడ / ఆనందపురం & భోగాపురంలలో స్పాట్ రిజిస్ట్రేషన్‌తో, తగ్గింపు ధరలతో కలవు. ఫోన్ : 98661 70208 [V- 2759]

■ కేవలం 6 లక్షలకే 100 గజాల Plot హైవేకు కిలోమీటరు దూరంలో ఒక మున్సిపల్ టౌన్‌కు దగ్గరలో మంచి ఆదాయాన్నిచ్చే మొక్కలతో సకల సదుపాయంతో అమ్మకానికి గలవు. ఫోన్ : 84998 91373 [V-2629]

R/E WANTED

■ సైట్ లీజ్‌కు కావలెను. (MNC కంపెనీ) కొరకు రోడ్ ఫేసింగ్ 40 సెంట్లు నుండి 1 ఎకరాం వరకు. శ్రీకాకుళం, వైజాగ్, విజయనగరం జిల్లాలు. ఫోన్ : 98483 26807 [V-10972]

Services

BUSINESS OFFER

■ అద్భుతమైన వ్యాపార అవకాశం Smart work Change your life style achieve your dreams earn extra income P/F time, M/F / Rtd. వారు డబ్బులు సంపాదించాలని కోరిక పనిచేయడానికి ఓపిక ఉన్నవారు ఫోన్ : 81064 61596 [V- 6321]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]

MARRIAGE SERVICES

■ క్రైస్తవ, హిందూ, మాలల వివాహ పరిచయ వేదిక. తేది: 15-08-2023 సా. 5 గం. నుండి రా. 8గం. వరకు. పబ్లిక్ లైబ్రరి, B.V.K. కాలేజి వద్ద, ద్వారకానగర్, విశాఖపట్నం ✆ 94412 41468 [B-788151]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [V- 794693]

■ విశాఖ లైఫ్ కేర్ సీతమ్మధార డాక్టర్స్ కోలనీలో వృద్ధులకు, మంచాన వున్నవారికి ఆధునిక వసతులతో పాటు భోజన, డాక్టర్స్, నర్స్, ఆయా సదుపాయం. మీ ఇంటి వద్దకే మా సేవలు. ఫోన్ : 98482 99968, 93907 96693 [V-11636]

SEPTIC TANK CLEAN

■ సుధాకర్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 98488 06516, 90149 03518 [V-2078]

TOURS & TRAVELS

■ గోవా, కర్నాటక గోకర్ణ, శృంగేరి, ధర్మస్థల, ఉడిపి, మూకాంబిక +20 క్షేత్రాలు 10రోజులు Sep. 5న, దసరాకు Oct.12న రామేశ్వరం, అరుణాచలం + 30క్షేత్రాలు 10రోజులు,లక్ష్మీటూర్స్. 9866246466 [HA-13657]

Wanted

■ Wanted Female Receptionist / Supporting staff with 10th/inter to work in clinic, Time : 10am to 10am, Maharanipeta VSP. Ph : 79897 12898, 79899 32178 [V- 10983]

CHANGE OF NAME

I, NOTLA BHASKAR VENKATA PYDI SATYA KUMAR S/o N.SATYAM, 6-123, Vidya Nagar, Vepagunta, Visakhapatnam- 530047, (AP). have changed my name from NOTLA BHASKARA VENKATA PYDI SATYA KUMAR (Old Name) to NOTLA BHASKAR VENKATA PYDI SATYA KUMAR (New Name), hence after all my documents and correspondence will continue with my New Name NOTLA BHASKAR VENKATA PYDI SATYA KUMAR

■ సెక్యూరిటీ గార్డ్స్ : వైజాగ్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 12 గం॥ డ్యూటీకి 10 వేలు నుంచి 12 వేలు వరకు. అర్హత : టెన్త్ పాస్. రూం ఫ్రీ. ఫోన్ : 77804 78285, 83092 89784 [V- 2088]

■ అనుభవం కలిగిన అకౌంటెంట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. అర్హత : ఇంటర్, డిగ్రీ, మంచి జీతం. శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, ప్రియా గార్డెన్స్, సింహాచలం. ఫోన్ : 94418 74245 [V- 1199]

■ NAD ప్రముఖ విద్యా సంస్థలో 2 సం॥ అనుభవం ఉన్న 25 to 35 years Lady Coordinator కావలెను. అర్హత : డిగ్రీ. CV Send : abcindia 729@gmail.com ఫోన్ : 97010 39939 [V- 797263]

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, రిసెప్షనిస్టులు, డేటా ఎంట్రీ, 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, B.Tech, ITI అన్ని గ్రూపులు కావలెను. రూం + భోజనం. ఫోన్ :75697 08799, 74162 10260 [V- 776784]

■ Wanted Exp. Lady Front Office Clerk with Computer Knowledge. Exp. Hindi Teacher for High School, N.T.School, Akkayyapalem, VSP. 9959094720. [V- 3698]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]

■ MEENAXY PHARMA(P) Ltd, Wanted Accountant-01, Sales Executives-2, MBA Marketing-4 at Hyderabad. ✆ 90005 95965, 96183 50980. [O-191577]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [HA-502]

■ హైదరాబాదులో ఉద్యోగ అవకాశాలు M/F కేర్ టేకర్స్ కావలెను. Age:21-45, Salary:16-20 వేలు, భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలవు. ఆసక్తి కల వారు కింది నెంబర్‌కి కాల్ చేయండి. 8106628388 [G-877]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏయూ ప్రగతితో అమితానందం

యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ డైరెక్టర్ డాక్టర్ అశ్వినీకుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతి తమకు అమితానందాన్ని కలిగిస్తోందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ టెక్నాలజీ లైసెన్సింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.అశ్వినీకుమార్ అన్నారు. సోమవారం ఆయన ఏయూకు విచ్చేసి తాను చదువుకున్న హ్యూమన్ జెనిటిక్స్ విభాగాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన ఐపీఆర్ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో వచ్చిన మార్పులు, అభివృద్ధిని సామాజిక మాధ్యమాల సహాయంతో తాము ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు. దార్శనికంగా ఆలోచిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే విధానాన్ని వివరించారు. గత నాలుగు సంవత్సరాలుగా మేధోహక్కులు, స్టార్టప్ రంగాల్లో ఏయూ సాధించిన అభ్యున్నతిని ప్రశంసించారు. వర్సిటీకి, విభాగానికి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరుకోవడం వర్సిటీకి గర్వకారణమన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఐపీఆర్ పాలసీని తయారు చేసి అందించిన ఘనత ఏయూకే దక్కిందన్నారు. అనంతరం అశ్వినీ కుమార్‌ను వీసీ సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, డాక్టర్ హనుమంతు పురుషోత్తం పాల్గొన్నారు.


అశ్వినీకుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్, జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లతో పాటు పారిశుధ్య పనులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని ఆఫీస్ ఇన్‌చార్జి సత్యనారాయణను ఆదేశించారు. పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి ఈత కొలనులో మట్టిని తొలగించి పరిశుభ్రమైన నీటితో నింపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసరాలు శుభ్రంగా ఉంచి మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాలరావు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

ఘనంగా ఇండియన్ బ్యాంక్ వ్యవస్థాపక వేడుకలు


వేడుకల్లో బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకటరమణారావు, అధికారులు

దొండపర్తి: ఇండియన్ బ్యాంక్ 117వ వ్యవస్థాపక, స్వాతంత్ర్య దిన వేడుకలను బ్యాంక్ జోనల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రామా ప్రారంభించారు. స్వాతంత్ర్యోద్యమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం బ్యాంక్ జోనల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణారావు ఆగస్టు 14న నిర్వహించుకుంటున్న భయానక విభజన సంస్మరణ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఇండియన్ బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవ విశేషాలను వెల్లడించారు. ఖాతాదారులు కూడా బ్యాంకు అందిస్తున్న సేవల పట్ల తమ అనుభవాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మెయిన్‌బ్రాంచ్ మేనేజర్ బి.సంతోష్‌కుమార్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయం

సీతంపేట: మహాత్మాగాంధీ ఆదర్శాలు, త్యాగాలను భారతీయులు తరతరాలుగా గుర్తించుకోవాలని గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గాంధీ సెంటర్, ప్రిజమ్ కళాశాల ఆధ్వర్యంలో గాంధీ పేరు కలిగిన 18 మంది విశిష్ట వ్యక్తులను సోమవారం సత్కరించి జ్ఞాపికలు, పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచం అనుసరించాల్సిన నాయకుడు మహాత్మా గాంధీజీ అని పేర్కొన్నారు. అనంతరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్, ప్రిజమ్ కళాశాల అధినేత డి.సత్యనారాయణరెడ్డి తదితరులు గాంధీ గొప్పతనంపై ప్రసంగించారు. కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి ఆచార్య బి.రామారావు, సంయుక్త కార్యదర్శి ఆచార్య బి.ఎస్.మూర్తి, కోశాధికారి జె.పి.శర్మ, న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ, కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణారావు, శేఖరమంత్రి ప్రభాకర్, డాక్టర్ ఆర్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజశేఖర్, మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు పాల్గొన్నారు.